


# అభయమధురిమ

శీతంరాజు చిట్టిబాబు

వరండాలో యీజీ ఛైరులో కాళ్ళు బారజాపుకు పడుకుని పేపరు చదువుకుంటున్న రంగశాయి గేటు చప్పుడుకు అటు చూశారు. చేనేత చీరె జాకెట్టుతో నుదురుకు తిలకం, చెవులకు జూకాలు, కుడి చేతికి వాచి మినహా యే యితర ఆభరణాలు, అలంకరణలు లేని ఓ అందమైన అమ్మాయి. రెండు చేతుల్లో రెండు ఆపిల్సు పట్టుకుని, అతి బిడియంగా అడుగు లేస్తూ సమీపించి నమస్కరించింది.

ఆ అమ్మాయి యెవరో యెందుకొచ్చిందో తెలియక తెల్లపోతూ లేచి కూర్చున్న శాయి, తనూ మర్యాదకు చేతులు జోడించబోతే, ఆమె "పెద్దవారు మీరు ఆశీర్వదించాలి గాని నమస్కరించకూడదు" అని మృదువుగా అని ఆయన చేతుల్లో యాపిల్సు పెట్టి, వంగి ఆయన పాదాలు పట్టుకుంది.

"ఇదేమిటమ్మా! నా కాళ్ళ వదులు, ఏ చందా కోసమో వచ్చావనుకున్నా ఈ యాపిల్సేమిటి? స్టూడెంటులాగున్నావు, సంగతేమిటో చెప్పు" అంటూ శాయి కాళ్ళు వెనక్కులాక్కున్నారు.

నేను మీ అభయం కోసం వచ్చినదాన్ని. స్టూడెంటూనైనా సాంప్రదాయాలు పాటిస్తూ పెద్దలను గౌరవించటం చిన్నప్పటి నుండి అలవాటే. నా బాధ విని, నా కోరిక మన్నించాలని ప్రార్థిస్తున్నా" అంటూ ఆమె ఆయన పాదాలను కళ్ళ కద్దుకుని లేచి నిలబడింది.

ఆమె వినయానికి ముగ్ధులైన శాయి ఆమెకు ప్రక్కనున్న కుర్చీ చూపి కూర్చోమని "నీ పేరేమిటమ్మా? ఏం చదువుతున్నావు" అని అడిగారు.

"సరోజండి! బి.టెక్ ఫైనలియర్‌లో ఉన్నా" అంది.

ఆలోచన పరంగా తల క్రిందకు పైకి కదిలించి తన కొడుకు శ్రీనుతో పాటు చదువుకునే అమ్మాయి అని గ్రహించారు. "అభయం కోసం వచ్చానని అంటున్నది యేమిటా అనుకుని" అయితే మా శ్రీనివాస్ నీకు తెలిసుండాలి" అన్నారు.

"తెలుసండీ" అని ఇంకా యేమడగబోతున్నారో అనుకుంటూ ఆయనవంక బెరుకుగా చూసింది. ఆయన వెంటనే యేమీ అడక్కుండా నాలుగు వైపులా పైకి క్రిందకు చూసి, నేలవైపు నిలకడగా చూడటం మొదలుపెట్టారు.

"శీనుగారు, నేను క్లాస్‌మేట్స్‌మేనండి. మెరిట్ స్టూడెంట్స్‌గా ఒకరినొకరం గౌరవించుకుంటూనే మాట్లాడుకునేవాళ్ళం. సహజంగా మామధ్య ఆకర్షణలు పెరిగినా, నేను నా లిమిట్స్‌లోనే ఉంటూ వస్తున్నా."

ఆయన ముఖంలో ఆశ్చర్యం తప్ప యేయితర భావము చూపకుండా వింటున్నారు.

"నన్ను సెల్ కొనుక్కోమన్నాడు. కొనుక్కోలేను, నాకవసరం కూడాలేదు అన్నాను. తను కొనిస్తానన్నాడు. అక్కర్లేదన్నాను. అతను రెండేళ్ళనుంచీ లేనిది, ఇప్పుడు ప్రేమపిచ్చి పెరుగుతూ, వెంటనే నేను దగ్గిరవకపోతే యాసిడ్ పోస్తానని, యేదో విధంగా చంపుతానని, లేకపోతే అత్మహత్య చేసుకుంటానని అంటున్నాడు. అతను స్వతహాగా మంచివాడని నాకిప్పటికీ అభిప్రాయం ఉన్నా పట్టుదల పెరిగి యెప్పుడు యే అఘాయిత్యం చేస్తాడోనని భయపడుతున్నా".

ఆయన కుర్చీలో కాస్త ఇటూఅటూ కదిలి మళ్ళీ కుదురుగా కూర్చుని" ఇంత జరుగుతున్నా నువ్వు ప్రిన్సిపాల్‌కుగాని మీ వాళ్ళకుగాని చెప్పలేదా?" అని అడిగారు.

"లేదండి. మాది చిన్నాపురం. నేనిక్కడ శాయినగర్‌లో ఒక్కదాన్నే ఉంటున్నా. చితికిన గౌరవ కుటుంబం మాది. మన కుటుంబాల గౌరవ ప్రతిష్ఠలు దృష్టిలో పెట్టుకుని ఆ పనులు చేయలేదు. అలా చేస్తే అతన్ని రెచ్చగొట్టినట్లవుతుందని, పర్యవసానం మా ఇద్దరి జీవితాలు భయంకర దుర్ఘటనలతో అంతమవుతాయని అనుకున్నా. అంతేకాక, మీకు తెలుసు. పేపర్లు, అనేక టీవీ ఛానళ్ళు జరిగిన విషయం మా ఫోటోలతో సహా చిలవలు పలువలుతో దారుణంగా ప్రకటిస్తారు. పోయిన వాళ్ళంపోగా మా క్యారెక్టర్‌లకు అపకీర్తులు ఆపాదించవచ్చు. అడిగేవాళ్ళు అడుగుతూ ఉంటే, ఇరు కుటుంబ సభ్యులు సిగ్గుతో సమాధానాలిచ్చే పరిస్థితి. ఇద్దరం శవాలుమైతే పదిమంది పలుభావాలతో వ్యాఖ్యానించటం, పోస్టుమార్టంలో జరిగే తతంగం ఊహిస్తే విపరీత దుఃఖం కలుగుతోంది" అని గద్గద స్వరంతో ముగిస్తూ, కళ్ళనీళ్ళు పెట్టుకొంది సరోజ.

"కళ్ళు తుడుచుకోమ్మా! భయం వద్దు ధైర్యంగా ఉండు. శీను అంత దుర్మార్గుడు కాదు. క్రిమినల్ పనులకు పోయే గుణం వాడికిలేదనే నా నమ్మకం. అయినా యీ సమస్యకు పరిష్కారం

ఆలోచించాలి. సున్నితంగా వాడిని కదిలించి, ప్రవర్తన మార్చుకోమని నచ్చచెప్పాలి. ఇద్దరూ చదువు మధ్యలో ఉన్నారు. ఆరునెలల వరకు యెవరిదారిని వాళ్ళు పోవటం కుదరదాయె" అంటూ శాయి ఆలోచనలోకి పోయారు.

కొడుకు శీను చిన్నప్పటి నుండి గారాబంగా పెరిగాడు. ఇప్పుడు తల్లిలేదు. తను, పెద్ద కొడుకు కోడలు వాడిని వాత్సల్యంతో చూస్తున్నారు. ఏదైనా యవ్వనంలో కొచ్చిన పిల్లలను వాళ్ళున్న మార్గంలోంచి మరల్చటం బహు కష్టం. ఆశయాలు గొప్పవైనా, ధ్యేయం వక్కనబెట్టి, వెంటనే అప్పటికప్పుడు ఆనందం, సుఖం కావాలనుకుంటారు. తొందరపాటుతనం వల్ల యే ముప్పు తెచ్చుకుంటారో, జీవితంలో యెంత నష్టపోతారో తెలుసుకోలేరు, అనుకుంటూ...

"శీనుతో యీ విషయం మాట్లాడాలంటే వాడు సెలవలని స్నేహితులతో సరదాగా బెంగళూరు, మైసూరు టూరు వెళ్ళాడు. రాగానే మాట్లాడతాను, ఏం చెప్పినా సామాన్యంగా యెదురు చెప్పడు" అన్నారు.

"అట్లాగేనండి అతనూ ఇంకో నలుగురు మా క్లాస్‌మేట్స్‌తో కలిసి టూరు వెళ్ళాడని తెలిసే వచ్చానండి. దయచేసి నామీద క్రోధంతో పగపట్టకుండా చూడండి. మా పరీక్షలయ్యేంత వరకు నిత్యం ఒకరినొకరం కాలేజీలో చూస్తూ ఉండటం తప్పదు. తోటివాళ్ళ ముందర, వాళ్ళతోపాటు మాట్లాడుకుంటూ ఉండటం తప్పదు. ద్వేషము, అసహ్యము అతను పెంచుకొని మాట్లాడితే భరించలేను. మా మధ్య యేదో జరిగినట్లు వాళ్ళు పసిగడితే, అదేమిటో తెలుసుకోవాలని వాళ్ళ ఆరాటం, గుసగుసలతో కథలల్లుతారు. పెద్దవారు మీరు, అతన్ని శాంతింపచేస్తే మా ఇద్దరిని కాపాడినట్లవుతుంది" అంది సరోజ, ఆయనకు కర్తవ్యం సూచిస్తున్నట్లు.

సరోజలో ఆందోళన యెంత కనిపిస్తున్నా, ఆమె ధోరణి చూస్తే ఆయనకు ఆశ్చర్యంతోపాటు, నవ్వు కూడా వచ్చింది. జాలీ పెరుగుతోంది. ఆమె కోరిక చూస్తే వాళ్ళిద్దరి జీవితాలుగాని, వాళ్ళలో యే ఒక్కరి జీవితంగాని నాశనం కాకూడదు. ఇద్దరి చదువులు సాగాలి. పరిస్థితేమో ఒకరు మృగంగా, ఇంకొకరు సాధు జంతువుగా ఉన్నట్లుంది. మాటల తీరునుబట్టి వాడిని ఆమె అమితంగా ప్రేమిస్తున్నట్లే అర్థమవుతోంది. వాళ్ళ విషయంలో యే విధమైన నిర్ణయం తీసుకోవాలన్నా ముందు వాళ్ళ చదువులు, వాటితో అందుకోగల గౌరవ స్థితులు దెబ్బతింటాయేమోనసే భయం కూడా వుంది.

తనదేమో చితికిన గౌరవ కుటుంబం అంది. అయితే మాత్రం విపత్కర పరిస్థితుల్లో యెట్లా ప్రవర్తిస్తారో తెలియదు, చెప్పలేం. కుటుంబ బలగం యేమిటో తెలియదు. వివరాలప్పుడడగటం అనవసరమనిపించింది. శీను వచ్చిన తర్వాత వాళ్ళిద్దరి మధ్య అసలు సంగతేమిటో తెలుసుకోవాలనుకొంటుండగా, కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకుంటూ సరోజ...

"శలవలమర్నాడు అతను కాలేజికి వెళ్ళిన తర్వాత నేను ఆపూట కాలేజికి వెళ్ళకుండా మళ్ళీ మిమ్మల్ని కలుసుకుంటానండి. మీరు నన్ను యెట్లా ఉండమంటే, నేనట్లా వుంటాను" అంది.

"అట్లాగేనమ్మా! వెళ్లిరా. ధైర్యంగా వుండు" అంటూ సరోజను పంపించేశారు శాయి.

మళ్లీ వెంటనే అనిపించింది. పాపం సరోజకు కాస్త కాఫీ యిప్పించి పంపిస్తే బాగుండేదని. ఆపిల్సు తెచ్చిచ్చి, గౌరవిస్తూ ఎంతో వినయంగా వుండి, విధేయత కూడ చూపింది. మంచి అమ్మాయిలావుంది. మరి వీడు దౌర్భాగ్యంగా ప్రవర్తిస్తున్నాడంటే బాధగా వుంది అనుకున్నారు.

సరోజ వచ్చినప్పుడు కోడలు సుశీల పనులలో వుండటం వల్ల పిలవాలనిపించలేదు. ఎనిమిదింటి కల్లా మొగుడుకు కావలసినవి చూసి ఆఫీసుకు పంపటం, తరువాత రెండేళ్ళ కొడుకు విజయ్‌కు నీళ్ళుపోసి నిద్రపుచ్చటం, తన స్నానం, వంట వగైరాలతో హడావుడి, సరోజ మధ్యాహ్నం వచ్చివుంటే సుశీలను కూడ పిలిచి తనతో కూర్చోమనేవారే. సుశీల ఆయనకు స్వంత మేనకోడలే కూడాను. తెలివిగలది, చదువుకున్నది. చిలిపితనంతో పాటు తన దగ్గర చనువున్నది. భోజనం చేసిన తర్వాత సరోజ సంగతి ఆమెతో చెప్పచ్చులే అనుకుని మళ్ళీ పేపరు చదువులో పడ్డారు.

× × ×

సరోజ రావటం మొదలు వెళ్ళేదాకా జరిగిన విషయమంతా కోడలు సుశీలకు శాయి చెప్పి, "ఈ రోజుల్లో అటువంటి అమ్మాయిలున్నారంటే ఆశ్చర్యంగా వుంది. అందానికి అందం, తెలివికి తెలివి, మర్యాదకు మర్యాద అన్నీవున్న సలక్షణమైన పిల్ల. చూడబోతే గౌరవ కుటుంబానికి చెందినట్లే అనిపిస్తోంది. శీను రాగానే యెట్లా కదిలించి, యెట్లా వాడిని మార్చాలో నా ఆలోచనలకందటం లేదు. నువ్వేమంటావు" అన్నారు.

"స్నానం చేసి గదిలో కొచ్చినప్పుడు మీరు మాట్లాడుకుంటున్నారు. హాల్లోకొచ్చి, కిటికీలోంచి ఆ అమ్మాయిని చూశానండీ మామయ్యా, నాకు తెలిసిన వాళ్లేవరూ కాదులే అని కిచెన్‌లోకి వెళ్లిపోయా. ఆ అమ్మాయి అందచందాలకు మీ మెచ్చుకోలు సరిపోయింది. కళాకాంతులన్నీ అమ్మాయే".

"అయితే సరోజ నీకు నచ్చిందన్నమాట. శీను పిచ్చి బెదిరింపులు పక్కన బెడితే, యిద్దరి మధ్య ప్రేమవుందని తెలుస్తూనే వుంది. ఏ కులమో యేమో, సాంప్రదాయం యెటువంటిదో తెలియదు".

"అదేంటి మామయ్యా. రోజూ పేపరు చదువుతూ, టీవీ చూస్తూ ఉన్నారు, పుస్తకాలు చదువుతారు. ప్రపంచంలో ఒకదేశపు అబ్బాయి వేరే దేశపు అమ్మాయిని చేసుకోవటాలు ఎన్నో జరుగుతున్నాయి. మతాలు, కులాలు అడ్డొస్తున్నాయా? సరోజ యిక్కడ అమ్మాయేగా? సాంప్రదాయం అనేది సరిపోకపోతే నేర్పవచ్చు" అంది సుశీల నవ్వుతూ.

"అవుననుకో, వీళ్ళు యీ గందరగోళం నుంచి బయటపడాలిగా. సర్దుకుంటే, మనకేం కట్నకానుకలు అక్కర్లేదు. సంబంధం కలుపుకోవచ్చు" అన్నారు శాయి. మంచిగా సమస్య తీరుతుందని, కొడుకునే సంతోషపెట్టవచ్చని.

"అదే జరిగితే అదృష్టమేనండి మామయ్యా! ఇంటికి కళ, నాకోతోడు వస్తుంది. మీరు ఒప్పుకుంటే నేనంతా చూస్తాను. నిర్భయంగా నాకు వదిలెయ్యండి. నాలుగు రోజుల్లో సరోజ మనింట్లో అద్దెకుండేట్లో మరేదో చేస్తాను. వాళ్ళిద్దరూ మంచి స్నేహితులవుతారు. సరోజ ఉండటానికి వరండాలో గ్రిల్‌గది,



విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జనవరి 12న జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో మల్లెతీగ మాసపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్టూన్ల పోటీలో ప్రొఫెసర్ ఎన్.ఎస్. మూర్తినుండి ప్రథమ బహుమతిని అందుకుంటున్న పగడాల బాలకోటేశ్వరరావు

దాని కానుకుని ఉన్న చిన్నగది ఇద్దాం" అంది సుశీల ధీమాగా!

"చాకచక్యంతో యేదో చేస్తావనుకుంటే, అమ్మో మనింట్లోనే ఇప్పుడు ప్రళయం తెస్తానంటావు" అన్నారు శాయి భయం భయంగా.

"అంతకంటే గత్యంతరం లేదండి మామయ్యా. వాళ్ళు యెప్పుడుపడితే అప్పుడు మాట్లాడుకునే అవకాశం ఉన్నట్లవుతుంది. చెడు కృత్యాల ధ్యాస తగ్గుతూ, స్నేహం పెరుగుతూ ఉంటుంది. పరీక్షలవగానే వాళ్ళు దంపతులు కాబోతున్నట్లు, అప్పుడప్పుడు మనం నేర్పుగా మాటల్లో వాళ్ళకు అర్థమయ్యేట్లు మాట్లాడుతూ ఉంటే సరి! గ్రిల్ గదిలో చదువుకుంటూ ఉంటుంది. ఆ గదిలో పడుకుంటుంది. భోజనానికి దగ్గిరలోనే వాళ్ళ మెస్ కూడా ఉంది అంది సుశీల.

"సరేనమ్మా, నువ్వు చెప్పేది బాగానేవుంది. మరి సరోజ తల్లితండ్రులు ఒప్పుకోవాలిగా అట్లా జరగాలంటే" అన్నారు శాయి.

"ఎందుకు ఒప్పుకోరు? మన సంబంధంకంటే మంచి సంబంధం తేగలరా? కుర్రాడు ప్రేమిస్తున్నాడు. అమ్మాయి కిష్టం అని తెలుస్తోంది. కట్నం అక్కర్లేదంటున్నాం. ఇల్లు కనుక్కొని నేను రేపే వెళ్తానండి మామయ్యా. అంతా సానుకూలంగా అవుతుంది" అంది సుశీల.

"సరే! అంతా బాగా జరిగిపోతే నాకింకేం కావాలమ్మా? అలాగే కానీ" అన్నారు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ.

× × ×

నాలుగు రోజుల తరువాత

శీను గేటు తీసుకుని వస్తూ గ్రిల్ గదిలో సరోజను చూసి తెల్లబోయాడు. సరోజ 'గుడ్‌మార్నింగ్' అంది. అతను వరండాలో రెండు చేతుల్లో బ్యాగులు క్రిందపెట్టి, ఆశ్చర్య సంతోషాలతో "గుడ్ మార్నింగ్, ఇక్కడకు దాపురించావేమిటి" అన్నాడు సరదాగా.

సుశీల లోపల్నుంచి వస్తూ "నేను చెప్తాను లేవయ్యా. ముందర ఇంట్లోకొచ్చి కాఫీ తాగి స్నానం చేద్దువుగాని. కాసేపు పడుకొని రెస్టు తీసుకుంటే భోజనం చెయ్యచ్చు" అని తనొక బ్యాగు తీసుకుని 'రా, లోపలికి' అంటూ దారితీసింది.

"అదికాదు వదినా", అంటూ రెండో బ్యాగుతో శీను ఆమెను అనుసరించాడు.

"ఇప్పుడేం మాట్లాడకు. మామయ్యగారు పూజలో ఉన్నారు. అన్ని సంగతులు మధ్యాహ్నం కాఫీ టైములో" అంది. వీళ్ళకంతా తెలిసినట్లుంది అని భయంతో, తండ్రికి పూజలోంచి లేచిన తర్వాత కనబడచ్చులే అనుకుంటూ కాఫీ తాగి తన గదిలోకి వెళ్ళిపోయాడు శీను.

సుశీల, మామగారితో నెమ్మదిగా "శీను వచ్చాడు. వాళ్ళిద్దరు గుడ్‌మార్నింగ్‌లు చెప్పుకున్నారు. శీనును మీరు పలకరించడంగాని, ఇప్పుడేం అడగకండి. మధ్యాహ్నం కాఫీ టైమ్‌లో నేను మీముందరే కదిలిస్తా" అంది.

"సరేనమ్మా" అంటూ శాయి మళ్ళీ పూజ కొనసాగించారు.

× × ×

నాలుగింటికి రెండు ప్లేట్లలో స్వీట్లు, బిస్కట్లు తెచ్చి హాల్లో టీపాయ్‌మీద పెడుతూ సుశీల మామగారిని, మరిదిని పిలిచింది, "కొద్దిసేపు హాల్లో కూర్చుందురుగాని రండి. మీకో తీపి విషయం చెప్పాలి" అంటూ.

"రారా శీను! వదినేదో తీపి విషయం చెప్తానంటోంది. అన్నయ్య కూడా ఆఫీసు నుంచి వస్తే బాగుండేది" అన్నారు శాయి, సోఫాలో కూర్చుంటూ.

"ఏదో కొత్త విషయం చెప్పి మనల్ని సర్‌ప్రయిజ్ చేయటం వదినెకు అలవాటేగా" అంటూ శీను వచ్చి యెదురు సోఫాలో కూర్చున్నాడు. నవ్వుతూ బయటకు మొహం పెట్టినా, లోపల తనసేమన్నా ఆట పట్టిస్తుందేమో ననుకున్నాడు. వెంట వచ్చిన విజ్జు అతని ఒళ్ళో చేరాడు.

చదువుకుంటున్నట్లు నటిస్తూ సరోజ గ్రిల్ గదిలో కూర్చుని అంతా వింటోంది నవ్వుకుంటూ.


"శ్రీవారికి అన్నీ చెప్పే చేస్తాను. చేసి చెప్తాను కూడా. ఆయన సంతోషించిన సంగతే. వడ్లగింజలో బియ్యంపు గింజ. శీను టూరు వెళ్ళే ముందు రోజు పొద్దున అతను విజ్జుగాడిని డాబామీద ఆడిస్తుంటే, వాడిని తీసుకురా, నీళ్ళు పోయాలి అని కేకేసి మెట్లు దగ్గిర నిలబడ్డాను. విజ్జుగాడిని నాకు అందిస్తుంటే, అతని అరచేతిలో ఇంకుతో రాసుకున్న 'ఎస్. సరోజ' అని అక్షరాలు కనిపించినై. నాకు అర్థమైనా, అప్పటికప్పుడు అడగకూడదు, చూడనట్లే ఉండాలని, బయటికి చదవకుండా, నవ్వు బయటికి రానీయకుండా విజ్జును తీసుకుని వెళ్ళిపోయా".

శాయిగారి ముఖంలో చిరునవ్వు, శీను ముఖంలో బెరుకుతో కలిసిన సిగ్గు కనిపించినై. సుశీల మళ్ళీ మొదలెట్టింది.

"రొటీన్‌గా పనులు చేసుకుంటున్నా, ఆలోచనలు మాత్రం ఆగటంల్లేదు. సరోజ అతనికి దైవతై ఉండాలి. ముందు మన ఇంటిపేరు ఇనీషియల్ 'యస్' కూడా ఉందికాబట్టి వట్టి దేవతకాదు, విడదీయరాని బంధంగా కోరుకునే నూరేళ్ళ పంట దేవతగా అనిపించింది.

యవ్వనంలో ఉన్నాడు, అందగాడే! అందమైన అమ్మాయిలు ఆకర్షించడం సహజం. సరోజ యెవ్వరో, ఇతనికి ఆమెకు స్నేహం ఉందో లేదో, ఒకవేళ ఆమె తిరస్కరిస్తే యీ రోజుల్లో ప్రమాద పరిస్థితికి దారితీయచ్చు. ప్రేమ సాధించటానికి యెంత సాహసమైనా చేస్తారేగాని వెనుదీయరు కొందరు కుర్రాళ్ళు మూర్ఖంతో. ఏది జరిగినా చదువు చెడుతుంది. కేసుల్లో ఇరుక్కోవచ్చు. మరి శీను విషయంలో యెలా జాగ్రత్తపడాలా, కర్తవ్యం యేమిటా అనిపించింది. అందుకని శ్రీవారితో చెప్పటం, చర్చించటం చేశా. ఆయన తన కంపెనీ వ్యవహారాలతో తీరిక ఉండటంలేదని, సమస్య పరిష్కారానికి నా తెలివితేటలు చాలులే అని శాంతంగా అన్నారు, నవ్వుతూ. అదేదో నన్నే చూడమని పర్మిషన్ ఇచ్చారు. భయపడినక్కర్లేదని ధైర్యం కూడా చెప్పారు! నాకు కొద్దిగా రోషం కూడా వచ్చి వెంటనే సరోజను కలవటానికి పూనుకున్నా.

"సరోజ యెవరో తెలుసుకోవటం, కలుసుకోవటం ఊహలు కూడిన ఎంక్వయిరీలతో తేలిగ్గానే చేయగలిగాను. ఆ అమ్మాయితో నేను ఫలానా అని, నన్ను ఒక అక్కయ్యలాగ భావించమని చెప్పి ఆప్యాయత చూపాను. మొదట్లో భయపడ్డా, చివరకు ధైర్యం చిక్కి, సంతోషంతో, తను శీనును ప్రేమిస్తున్నానని, అతనూ తనని ప్రేమిస్తున్నాడని, కాని తన కుటుంబ ఆర్థిక స్థితి మన అంతస్థును అందుకోలేదని విచారం



వెలిబుచ్చింది. పరీక్షలవగానే తమ వివాహానికి ఇరు కుటుంబాలను ఒప్పించగలమని అనుకున్నట్లు కూడా చెప్పింది. తనవైపు యిబ్బంది ఉండదు, మనమే కాదంటామని బయపడ్డారట.

ఆమె మాటలకు నాకు సంతోషము, జాలి కలిగినై. ప్రేమికుల విషయంలో కుర్రాడు దుర్మార్గుడు కాని, అమ్మాయి దుర్మార్గురాలుకాని కానప్పుడు, ఇతర విషయాలు ఆలోచిస్తూ, అడ్డు చెప్పకుండా వాళ్ళ వివాహానికి అంగీకరించడం న్యాయం. అయినా శీను విషయంలో మామయ్యగారు యేమంటారో, ఆయనకు సరోజమీద జాలి కలిగేట్టు చేయటం మంచిదనిపించింది. వెంటనే పథకం ఒకటి రూపొందించి, నాటకంలో నాయికలాగ సరోజను నటించమని ప్రోత్సహించాను. తనకు చాలా భయం, నటించలేనంది. కథ ఏమాత్రం అడ్డం తిరిగినా, తిట్లన్నీ నేనే భరిస్తాను, భయపడవద్దని, పాత్ర పోర్షన్ డిక్టేట్‌చేసి రప్పించాను.

సరోజ మనింటికొచ్చి మామగారిని కలిసి అమోఘంగా నటించి తనపాత్ర రక్తి కట్టించింది. మామయ్యగారికి జాలి కలిగింది. ఆమెకు ధైర్యంచెప్పి పంపించేశారు. తరువాత నాతో సంప్రదించారు. నేను ఏమీ యెరగనట్లే మామయ్యగారు చెప్పిందంతా విని ఆయన ఒప్పుకుంటే సరోజను కలిసి మనింట్లో అద్దెకుండేట్టు చేస్తానని చెప్పి ఆయన ఒప్పుదలతో ఆమెను తీసుకొచ్చాను. సరోజ శీను చదువులకు భంగం కలగకుండా ఉండటానికి ఎన్నో నిబంధనలు విధిస్తూ, కేవలం స్నేహితుల్లా మాట్లాడుకోవచ్చని సరోజకు చెప్తూ ఇంట్లో పోర్షన్ మామాయ్యగారి చేత యిప్పించా. నా తప్పులను క్షమించమని మామయ్యగారిని ఇప్పుడు ప్రాధేయపడుతున్నా" అని ఆయనకు నమస్కరించింది. ఆయన తిట్ల భయం కొద్దిగా ఉన్నట్లు" కాఫీ తెస్తున్నా అంటూ యిక అక్కడ నిలబడకుండా కిచెన్‌లోకి పరుగులా పెడుతుంటే...

"ఇంకో ప్లేటు స్వీట్లు, బిస్కట్లు కాఫీ కప్పు కూడా తీసుకురా సుశీలా" అన్నారు శాయి. హాలు గుమ్మంలోకి వెళ్ళి సరోజతో, నవ్వుతూ ఇక్కడే ఉండి అంతా విన్నావుగా. మాతోపాటు కాఫీ తాగుదువుగాని, రా అన్నారు. లేదండీ, చదువుకుంటున్నా అంటూ భయంభయంగా వచ్చి కూర్చుంది సరోజ.

"ఇన్నీ" వింటూ విజ్ఞు శీను వళ్ళోంచి దిగి సరోజ వళ్ళోకి చేరాడు.

అందరు ప్లేట్లు ఖాళీచేసి కాఫీలు తాగేశారు.

"అంతా అందరికీ అర్థమైందిగా, ఇకలేద్దాం" అని సుశీల ఒంకచూస్తూ "ఇక ఆరునెల్లో నీ చిలిపితనానికి హాలిడేస్ తీసుకో, జాగ్రత్త" అన్నారు నవ్వుతూ. సుశీల మళ్ళీ ఆయనకు దణ్ణం పెట్టింది, చిలిపితనపు చిరునవ్వుతో.

# ☺ హాస్య చినుకులు ☺

హీరోయిన్ని ఇంటర్వ్యూ చేస్తూ అడిగాడు సినీ విలేఖరి "మీరు వివాహితులా?" అని.

"అప్పుడప్పుడు" గడుసుగా సమాధానం ఇచ్చింది హీరోయిన్.

☺ ☺ ☺

"ఏరా, ఇవాళ దేవీనగర్‌లోని ఏడో నంబర్ ఇల్లు దోచుకుందామా?" అంటూ ఓ దొంగ తోటి దొంగను అడిగాడు.

"అబ్బే, లాభం లేదురా, నిన్ననే వాళ్ళబ్బాయిని ఎల్.కె.జీలో చేర్చారు. మనకేమీ గిట్టదు" అన్నాడు రెండో దొంగ.

☺ ☺ ☺

"ఇదేమిట్రా! శుభలేఖ మూడుభాషల్లో ప్రింట్ చేశారు" అడిగాడు శ్రీరామ్.

"ఏమీ లేదురా, పెండ్లి కొడుకు రైల్వేలో అనౌన్సర్‌గా పనిచేస్తున్నాడు లే" చెప్పాడు శ్రీరాజ్.

☺ ☺ ☺

"నాన్నా! నువ్వు అమ్మనెందుకు పెళ్ళిచేసుకున్నావు?"

"అయితే నీకూ ఆశ్చర్యంగానే వుందన్నమాట!"

☺ ☺ ☺

"మా నాన్న చిన్నతనంలో పొందలేనివన్నీ నాలో చూసుకోవడానికి ఇష్టపడతారు!

"ఒక ఉదాహరణ చెప్పు?

"ప్రోగ్రెస్ రిపోర్టులో ఏగ్రేడ్?

☺ ☺ ☺

"పెళ్ళికి ముందు నాకిలాంటివన్నీ ఇష్టం ఉండదు రాజా! ప్లీజ్ పెళ్ళయ్యే వరకు ఆగు!" రాజాను దూరంగా నెట్టేస్తూ అంది ప్రియురాలు.

"సరే అలాగే ఆగుతాను కానీ-ఇంతకీ నీ పెళ్ళెప్పుడు?" ఆత్రంగా అడిగాడు రాజు.

☺ ☺ ☺

"చిన్నప్పుడు పరీక్షల్లో కాపీ కొట్టి రాసే వాడివి, ఇప్పుడేమీ చేస్తున్నావు" అంటూ ఓ పూర్వ విద్యార్థిని అడిగాడు టీచర్.

"డబ్బింగ్ సినిమాలకు డైలాగులు రాసుకొంటున్నాను సార్" అని సమాధానమిచ్చాడు పూర్వ విద్యార్థి.

☺ ☺ ☺

"ఆ గిరిగాడు మరీ ఇంత పినాసీ అనుకోలేదురా"!

"ఏ మైందిరా?"

"2010 నుంచి 2020" వరకు అని న్యూ ఇయర్ గ్రీటింగ్ పంపాడురా"!

- వై.కె.మూర్తి